


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న మాజీ సర్పంచ్ మోత్యానాయక్, కాంగ్రెస్ నాయకుడు సంతోష్

# భూ సమస్యలు పరిష్కరించాలి

**సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేసిన బాపల్లితండా మాజీ సర్పంచ్ మోత్యానాయక్**

బొంరాస్‌పేట, జూలై 8 : మండలంలోని బాపల్లితండాలో చాలా ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూముల సమస్యలను పరిష్కరించాలని ఆ తండా మాజీ సర్పంచ్ మోత్యానాయక్, యూత్ కాంగ్రెస్ నాయకుడు సంతోష్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం వారు హైదరాబాద్‌లో సీఎంను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బాపల్లి తండాలో రైతులు చాలా సంవత్సరాలుగా భూములు సాగు చేసుకుంటున్నా వారికి పట్టాలు రాలేదని, పట్టాలు లేకపోవడంతో రైతుబంధు, రైతుబీమా, బ్యాంకుల్లో పంట రుణాలు, రుణ మాఫీ వంటి పథకాల ప్రయోజనాలు అందడం లేదని వారు సీఎంకు తెలిపారు. భూముల సమస్యలు పరిష్కరించి రైతులకు డిజిటల్ పాసు పుస్తకాలు ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

పాలబాయితండాకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని సీఎంను కోరారు. స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# నవాబుపేట బీఆర్ఎస్ కంచుకోట

**నియోజకవర్గంలోని కార్యకర్తలను కాపాడుకుంటాం**

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
- కేసీఆర్ లేకుంటే రాష్ట్రం వచ్చేదా !
- కరెంట్ కోతలు పెరిగాయి



కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారితో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తిక్‌రెడ్డి

నవాబుపేట, జూలై 8 : నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలను కాపాడుకోవడం తన వంతు బాధ్యతగా తీసుకుంటానని ఎవ్వరూ అధైర్యపడొద్దని, నవాబుపేట బీఆర్ఎస్‌కు కంచుకోట అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి అన్నారు. సోమవారం లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు రైతుబంధు అందలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఠంచన్‌గా రైతుబంధు డబ్బులు వచ్చేవని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి.. నేటికీ రుణమాఫీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ప్రజల మధ్య ఉండడం మన అదృష్టంగా భావించాలన్నారు. రాష్ట్రంలో కరెంట్ కోతలు ఎక్కువయ్యాయని విమర్శించారు. కేసీఆర్ హయాంలో నిమిషం పాటైనా కరెంట్ అంతరాయం రాలేదన్నారు. ఈ కాంగ్రెస్ పాలన చూస్తుంటే రాబోవు రోజుల్లో రైతులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు అదనంగా తులం బంగారం ఇస్తామని మోసపూరిత మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, కౌలు రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని చేతకాని దద్దమ్మ ప్రభుత్వమని దుయ్యబట్టారు. కొంత మంది నాయకులు ఒక్కో ఇంట్లో నాలుగు, ఐదు పదవులు తీసుకొని అనుభవించిన వారు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం సరికాదన్నారు. మళ్లొచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేసేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. నిన్నగాకమొన్న హైదరాబాద్‌లో ఆంధ్ర సీఎం చంద్రబాబు రేవంత్‌తో భేటీకావడం రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని, తన టీడీపీకి హైదరాబాద్‌లో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు జరిగిన చీకటి ఒప్పందమన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ కార్యకర్త గౌస్ మాట్లాడుతూ నవాబుపేటలో కొంత మంది అధికారం అడ్డుపెట్టుకుని కేసులు పెట్టే అవకాశం ఉన్నదని కార్తిక్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, నేను ఉన్నా భయపడే ప్రసక్తేలేదన్నారు. పోరాటమనేది బీఆర్ఎస్‌కు గానీ కేసీఆర్‌కు గానీ కొత్త కాదన్నారు.

### కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మండల నాయకులు..

మండ కేంద్రానికి చెందిన ఎస్ బ్రహ్మరెడ్డి, ఎం రాంచంద్రారెడ్డి, బీ వెంకటయ్య, సీహెచ్ బలరాం, వై శేఖర్ యాదవ్, ఎస్ సాయిరెడ్డిలు కాంగ్రెస్ పార్టీ నుంచి కార్తిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం బీఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు కందడ నాగిరెడ్డి మాట్లాడుతూ తామంతా బీఆర్ఎస్‌లో ఉంటామన్నారు. సీనియర్ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి మాట్లాడుతూ తన ప్రాణం ఉన్నంత వరకూ గులాబీ జెండానే మోస్తానన్నారు. యువ నాయకులు మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే యాదయ్య తన ఇంట్లోనే నాలుగు పదవులు అనుభవించి కార్యకర్తలనూ సంప్రదించకుండా రాత్రికిరాత్రే పార్టీ మారడం సమజం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను మోసం చేసిన వారు వచ్చే ఎన్నికల్లో కనుమరుగై పోతారని అన్నారు. ఈ సమావేశంలో పోలీస్ రాంరెడ్డి, బీఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, బీఆర్ఎస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కే గోపాల్ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు, దయాకర్‌రెడ్డి, యెల్లకొండ దేవస్థానం చైర్మన్ పట్లోళ్ల భరత్‌రెడ్డి, విజయకుమార్, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మహేశ్ రెడ్డి, శాంతికుమార్, పురుషోత్తంచారి, ప్రకాశం, మాణిక్‌రెడ్డి, గౌస్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాలు చేపట్టాలి

**రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లకు వినతి పత్రాలను అందజేసిన వీఆర్ఏల సంఘం నాయకులు**



రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్ఏల వారసుల సంఘం సభ్యులు

రంగారెడ్డి, జూలై 8 (నమస్తే తెలంగాణ) : గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 81, 85లను అనుసరించి వీఆర్ఏల వారసులకు త్వరితగతిన నియామక ఉత్తర్వులను అందజేయాలని బాధిత కుటుంబాలు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏలు 3,797 మంది ఉన్నారని, వీరి వారసులకు ఇప్పటివరకు నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని ఈ సందర్భంగా పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొంతమంది వీఆర్ఏలు మరణించగా ఆయా కుటుంబాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. ఇప్పటికైనా నియామక ఉత్తర్వులు ఇచ్చి ఆదుకోవాలంటూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

### వికారాబాద్ కలెక్టరేట్ వద్ద..

వికారాబాద్, జూలై 8 : 61 సంవత్సరాలు పై బడిన వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం నాయకులు సోమవారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న వీఆర్ఏల వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్

అంతకు ముందు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ వారసుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీకాంత్ మాట్లాడుతూ గతంలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20,555 మంది వీఆర్ఏలకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు 81, 85 జీవోను జారీ చేసి 16,758 మంది వీఆస్ఏలకు వారసత్వ ఉద్యోగాలను వారి అర్హతను బట్టి ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. తదనంతరం ఈ జీవోపై కోర్టు స్టే విధించడంతో కారుణ్య నియామకాలు చేపట్టలేదని గుర్తుచేశారు. 2023, నవంబర్ 21న హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వుల ప్రకారం జీవో 81పై స్టే ఎత్తివేయడం జరిగిందన్నారు. కోర్టు స్టే ఎత్తివేసినా.. ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి కారుణ్య నియామకాలు చేపట్టలేదన్నారు. దీంతో 61 సంవత్సరాలు పైబడిన వయస్సు గల వారు రాష్ట్ర వ్యాప్తంగా 3,797 మంది ఉన్నారని, వయస్సుకు మించి ఆయా కార్యాలయాల్లో సేవలు అందిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి వయస్సును దృష్టిలో ఉంచుకుని కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. నియామకాలు చేపట్టకపోవడం వల్ల ఇప్పటి వరకు 17 మంది మనోవేదనతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ వారసులకు కారుణ్య నియామకాల ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అంజయ్య, జనార్దన్, శ్రీనివాస్, రాజు, శేఖర్, యాదయ్య, సంగమేశ్వర్, నర్సింహులు, సందీప్ పాల్గొన్నారు.

# మైనర్లను పనిలో పెట్టుకుంటే చర్యలు




మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి, జూలై 8 (నమస్తే తెలంగాణ) : 14 సంవత్సరాల్లోపు పిల్లలను, మైనర్లను పనిలో పెట్టుకుంటే ఆయా యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతున్నదని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్ ముస్కాన్ జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. 14 ఏళ్ల లోపు చిన్నారులు చదువుకునేందుకు బడుల్లో ఉండాలే తప్ప పనిలో ఉండకూడదన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో పట్టుబడిన బాలకార్మికులను చదువుకునేందుకు వసతి గృహాల్లో చేర్పిస్తామన్నారు. జిల్లాలో సైబరాబాద్, రాచకొండ పరిధిలో 11 ఆపరేషన్ ముస్కాన్ టీములు పని చేస్తున్నాయని తెలిపారు. డీసీపీవోలు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించి ఇటుక బట్టీలు, భవన నిర్మాణాల్లో పని చేసే పిల్లలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా శిశు సంక్షేమ అధికారి పద్మజా రమణ, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి దేవి, ఆర్డీవోలు సూరజ్ కుమార్, సాయిరామ్, అనంత్ రెడ్డి, సైబరాబాద్, రాచకొండ పోలీసు అధికారులు, చైల్డ్‌వెల్ఫేర్ చైర్‌పర్సన్ నరేందర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, సీడీపీవోలు, ఎన్‌జీవోలు, చైల్డ్‌లైన్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పంటల్లో కలుపు జాతి మొక్కలను నివారించాలి



మల్లాపూర్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కొత్తూరు, జూలై 8: పతి 15– 20 రోజుల దశలో గడ్డి, కలుపు జాతి మొక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డా.సీ నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం దత్తతగ్రామం మల్లాపూర్‌లో పత్తి, మొక్కజొన్న, కాలీఫ్లవర్ పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించి మాట్లాడారు. పంట వేసిన 15–20 రోజుల దశలో కలుపు మొక్కలు పెరుగుతాయన్నారు. వీటి నివారణకు హిట్ వీడ్ మాక్స్‌ను 1 మి.లీ/లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న పంటలో లద్దెపురుగ నివారణకు కొరాజిన్ 0.36 మి.లీ/లీటర్ నీటిలో పిచికారీ చేయాలన్నారు. కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను మొక్క సుడిలో వేయాలన్నారు. కార్యక్రమంలో దత్తత గ్రామ కన్వీనర్ డా. లావణ్య, డా. స్వామి, డా. ప్రమీల, డా. పద్మశ్రీ, డా.సమతాపరమేశ్వరి, డా.నిర్మల, డా.అరుణ, వ్యవసాయ విస్తరణ అధికారి నిఖిత, రైతులు మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజావాణికి వినతుల వెల్లువ

- దరఖాస్తులను పరిష్కరించి ఎప్పటికప్పుడు వివరణ ఇవ్వాలి : రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు : వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్
- రంగారెడ్డి ప్రజావాణికి 110, వికారాబాద్ ప్రజావాణికి 122 ఫిర్యాదులు

రంగారెడ్డి, జూలై 8 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 110 ఫిర్యాదులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు ప్రతీమా సింగ్, భూపాల్ రెడ్డి, డీఆర్‌వో సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రజా భవన్ నుంచి వచ్చిన దరఖాస్తులను వివిధ శాఖల అధికారులు, ఆర్డీవోలు, మండల తహసీల్దార్లు పరిష్కరించి వాటిపైన వివరణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### వికారాబాద్ జిల్లాలో..

వికారాబాద్, జూలై 8 : ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి మండలంలో కూడా మండల కార్యాలయాల్లో మండల అధికారులు ప్రజా ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. నియోజకవర్గ పరిధిలో మున్సిపల్ కమిషనర్‌లు ప్రజావాణి దరఖాస్తు లు స్వీకరిస్తారని తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశం హాలు నందు నిర్వహించిన ప్రజావాణికార్యక్రమం లో ప్రధానంగా విద్య, వైద్యం, బీసీ, గిరిజన సంక్షేమం, విద్యుత్తు, పంచాయతీ, పింఛన్లు, మున్సిపాలిటీ, ధరణి, మైన్స్, భూ సర్వే తదితర అంశాలకు సంబంధించి 122 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు అందజేస్తూ ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణితో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీవో వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

### మా భూమిని మాకు ఇప్పించండి సారూ..

మా భూమిని మాకు ఇప్పించండి సారూ అంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఎన్కెపల్లి గ్రామస్తులు, రైతులు ఫిర్యాదు చేశారు. పూడూరు మండలం ఎన్కెపల్లి గ్రామానికి చెందిన సర్వే నెం. 99, 109, 101లలో 16 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిలో కొంత మంది భూ దందా చేసి వారు నకిలీ ధృవపత్రాలను తయారు చేసి మమ్మల్ని మా భూమిలోకి రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు, రైతులు తెలిపారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక



ఫిర్యాదులను స్వీకరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

### మధ్యాహ్న భోజన బాధ్యతలను అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఇవ్వడం సరైంది కాదు

రంగారెడ్డి, జూలై 8(నమస్తే తెలంగాణ) : మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతలను అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించడం సరైంది కాదని కార్మికులు పేర్కొంటున్నారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంకకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో కొన్ని మండలాల్లో మధ్యాహ్న భోజనం బాధ్యతలను అక్షయపాత్రకు అప్పగించడం జరిగిందని, క్రమక్రమంగా అన్ని పాఠశాలల బాధ్యతలను అప్పగించే ప్రయత్నం జరుగుతున్నదని, కార్మికుల పొట్టగొట్టవద్దని ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా కోశాధికారి కవిత, జిల్లా నాయకులు ఎల్లేష్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.అలివేలు, జిల్లా కార్యదర్శి వై.స్వప్న, ఉపాధ్యక్షులు గణేష్, కోశాధికారి సరిత తదితరులు ఉన్నారు.

# ప్రిలిమ్స్‌లో సత్తాచాటిన అంధ విద్యార్థులు



సంధ్య



రామకృష్ణ

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 8 : ఇబ్రహీంపట్నం సమీపంలోని అంధుల ఆశ్రమంలో నివాసముంటూ విద్యనభ్యసిస్తున్న అంధ విద్యార్థులు సంధ్య, రామకృష్ణలు ఇటీవల టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలకు ఎంపికై సత్తాచాటారు. ఈ సందర్భంగా స్ఫూర్తిజ్యోతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వందనం రాజు జ్యోతి మాట్లాడుతూ 2007లో అంధ విద్యార్థుల కోసం ఇబ్రహీంపట్నం సమీపంలో స్థాపించిన ఆశ్రమం ఎంతోమందికి ఆశ్రమం కల్పించిందన్నారు. సమారు 70 మంది అంధ విద్యార్థులు ప్రభుత్వరంగ సంస్థల్లో, ప్రైవేటు రంగ సంస్థల్లో 165మంది స్థిరపడినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రూప్స్‌తో పాటు ఇతర ప్రభుత్వరంగ ఉద్యోగాల కోసం ప్రయత్నించే అంధ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇప్పించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నల్లగొండకు చెందిన సంధ్య, కొండాపూర్‌కు చెందిన రామకృష్ణలు గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలకు ఎంపిక కావడం సంతోషంగా ఉన్నదని వారు పేర్కొన్నారు.